అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 22 ఫిబ్రవరి 2023

కరెంట్‌షాక్‌తో రైతు మృతి


ఘటనా స్థలంలో లింబన్న మృతదేహం

నవతెలంగాణ-ధర్పల్లి

కరెంట్‌షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన తోట లింబన్న 48 అనే రైతు సోమవారం రాత్రి తనపొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి పొలం వద్దే కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఉదయం వెళ్లి చూడగా విద్యుత్ ఘాతుకానికి గురై మృతి చెంది ఉన్నాడు. కొడుకు తోట నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ వంశీ కృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని లక్ష్మాపూర్ చింతలూరు గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫండ్స్‌తో సీసీ రోడ్లకు ఎంపీపీ కుంచాల విమల రాజు మంగళవారం భూమి పూజ చేశారు. లక్ష్మాపూర్ గ్రామంలో 10 లక్షల రూపాయలు సిసి రోడ్లకు మంజూరు అయ్యాయి. ముఖ్య అతిథి ఎంపీపీ కుంచాల విమల రాజు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. అదేవిధంగా చింతలూరు గ్రామంలో 5 లక్షలు మంజూరు కావడంతో ఎంపీపీ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిరుపతి రెడ్డి లక్ష్మాపూర్ సర్పంచ్ కైలాష్ ఎంపీటీసీ అను సాయన్న చింతలూరు సర్పంచ్ సుకన్య ప్రసాద్ కూలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ మండల్ కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్ పలు గ్రామాల ఉప సర్పంచులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

అసైన్డ్ భూమిని భూమిలేని పేదలకు పంచాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్

నవతెలంగాణ-గాంధారి

ప్రభుత్వ అసైన్డ్ భూమిని భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధారి మండలం మాతుసంగెంలో పేదలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతు సంగెం గ్రామంలో భూములు ఉన్న ఉన్నవారు రాజకీయ నాయకుల అండతో ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించుకొని బోగస్ పట్టాలు చేసుకున్నారని తెలిపారు. ఇలాంటి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోని భూమి లేని నిరుపేదలకు పంచి పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాలు భూమి ఇస్తామని హామీ ఇచ్చారని ఇలాంటి బోగస్ పట్టాలు రద్దు చేసి దళితులకు భూమి లేని అన్ని వర్గాల ప్రజలకు భూములను ఇవ్వవచ్చు అని ప్రభుత్వం అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ(ఎం), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భూపోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

అనంతరం పార్టీ నియోజకర్గ నాయకులు మోతిరాం నాయక్ మాట్లాడుతూ మండలంలో మతు సంగెం గ్రామంలో సాగు చేసుకుంటున్న నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమ్‌సింగ్, లక్ష్మి బాయి, మల్లేష్, రాంసింగ్ ,చింటూ, దేవి సింగ్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల ముసుగులో ఇసుక దందా



- డీడీ కట్టినా అదనంగా డబ్బులు చెల్లించాల్సిందే
- వ్యాపారస్తులదే పెత్తనం
- రూ.5500-6000 చెల్లిస్తేనే ట్రాక్టర్ ఇసుక
- చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

నవతెలంగాణ-మోర్తాడ్

ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చిన ముసుగులో వ్యాపారులు రంగ ప్రవేశం చేసి ఇసుక దందాకు తెరలేపారు. గృహ ఇతరాత్ర నిర్మాణ పనులు చేపట్టే స్థానికులకు ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చినా.. పాయింట్ వద్ద వ్యాపారులు కనుసన్నల్లో నడుస్తోంది. దీంతో రెండు వేలకు లభించే ఇసుక ట్రాక్టర్ ధర.. అమాంతంగా 5500 నుంచి రూ.6000 పలుకుతోంది. దీనికి తోడు వ్యాపారులే స్థానికుల పేరుతో డీడీలు కట్టిస్తూ ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని దోచుకుంటూ ఇసుక నిల్వలను దోచేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తూ 'మామూలు'గా తీసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మోర్తాడ్ మండలం సుంకేట్ పెద్దవాగు నుంచి డీడీలు కట్టిన వారికి ఇసుక తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.900 కట్టి ట్రాక్టర్ ఇసుకను తరలించుకోవచ్చు. కానీ ఇందుకు విరుద్ధంగా రూ.5500 నుంచి 6000 చెల్లిస్తేగానీ ఇసుక ట్రాక్టర్ రాని దుస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వానికి డీడీలు కట్టినా.. వ్యాపారస్తులకు డబ్బులు చెల్లిస్తేనే ఇసుక వస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.



మండలంలోని సుంకేట్ పెద్దవాగు నుండి ప్రభుత్వ అనుమతి పొందిన ఇసుక ర్యాంపు నుండి మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాలకు ఇసుక రవాణా గత కొంతకాలంగా కొనసాగుతుంది. ఇది అదునుగా భావించిన వ్యాపారస్తులు అనుమతి పొందిన వ్యాపార ట్రాక్టర్లను కాకుండా వ్యాపారస్తుల స్వంత ట్రాక్టర్లు మాత్రమే వాగులోకి అనుమతి ఇస్తున్నారు. ఇలా వచ్చిన ప్రతి ట్రాక్టర్ గ్రామ కమిటీతో పాటు వ్యాపారస్తులకు అదనంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. అధికారులు ఇస్తున్న అనుమతి పత్రాలకు అదనంగానే వ్యాపారం కొనసాగిస్తున్న అక్రమాన్ని సైతం అనుమతిగా మలుచుకుంటున్నారు.

రోజుకు 200 ట్రాక్టర్‌లు తరలించేందుకు అనుమతి వస్తున్నా.. అందుకు విరుద్ధంగా 280 నుండి 300 వరకు ట్రాక్టర్‌లలో ఇసుక తరలిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుంది.

ప్రభుత్వానికి డీడీ 900 చెల్లించడంతో పాటు వీడీసీకి రూ.1100, ట్రాక్టర్ కిరాయి రూ.800, కూలీలకు సుమారు 400 చెల్లించడంతో పాటు వ్యాపారస్తులు అదనంగా డబ్బులు దండుకుంటున్నారు. సుమారు రూ.2000 వరకు ట్రాక్టర ఇసుక రావాల్సి ఉండగా.. వీడీసీ, వ్యాపారస్తులు వసూళ్లతో ఏకంగా రూ.5500 నుంచి రూ.6000 చెల్లించాల్సి వస్తుంది. ఇంత జరుగుతున్నా అధికారులు వీటిపై స్పందించక పోవడంతోనే వ్యాపారస్తులు ఆగడాలు కొనసాగు తున్నాయని ఆరోపిస్తున్నారు. ఐదు గంటల తర్వాత నూతన వాహనాలు ఇసుక పాయింటు వద్దకు రాకుండా ఉండాల్సినప్పటికీ సమయం గడిచిపోయినా వ్యాపారస్తులు అధికారులను మభ్యపెడుతూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్త మవుతున్నాయి. వాహనాల నెంబర్లను ఓ వ్యక్తి రిజిస్టర్లో నమోదు చేయించుకోవడం సైతం మనకు కనిపిస్తుంది. వీటి ఆధారంగానే వ్యాపారస్తులు వాహనాల నుండి డబ్బులు వసూలు చేస్తారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనిఖీ చేపట్టి ఇసుక వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోడ కూలి అన్నదమ్ములు మృతి




నవతెలంగాణ-మోర్తాడ్

మట్టిగోడకు ప్లాస్టరింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గోడ కూలి అన్నదమ్ములు మృతిచెందారు. ఈ విషాదకర ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోన్ గోపుల రాములు(69)గోన్ గోపుల లింగన్(67) అన్నదమ్ములు మేస్త్రీ పని చేస్తుంటారు. స్థానికంగా చాకలి గణేష్ ఇంట్లో మట్టిగోడకు ప్లాస్టరింగ్ చేస్తుండగా గోడకూలి సంఘటన స్థలంలోనే లింగన్న మృతి చెందాడు. రాములును నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. పనులు చేస్తుండగా చివరి దశకు చేరుకునే సమయంలో గోడ కూలడంతో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు అక్కడ చేరుకొని పంచనామ నిర్వహించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు పరిశీలించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయాలి


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

- కార్మికవర్గ రాజ్య స్థాపనతోనే పెట్టుబడిదారి, మతతత్వ విధానాలకు సరైన గుణపాఠం
- రెడ్ బుక్ డేలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కార్మికవర్గ రాజ్యస్థాపన ద్వారానే పెట్టుబడిదారీ మతతత్వ విధానాలకు సరైన గుణపాఠం అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. ప్రపంచ రెడ్ బుక్ డే సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ కార్యాలయంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద ఫాసిస్టు విధానాలు, భగత్‌సింగ్ చరిత్ర అనే రెండు పుస్తకాలను విడుదల చేశారు. ఏ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ రాజ్య స్థాపన కోసం 1848లో ఫిబ్రవరి 21న కారల్ మార్క్స్, ఎంగెల్స్ నాయకత్వంలో కమ్యూనిస్టు ప్రణాళిక అనే పుస్తకాన్ని విడుదల చేసినట్టు తెలిపారు. ఇది విస్తృతంగా ప్రచారం జరిగి ప్రత్యామ్నాయ విధానాలతో కార్మికవర్గ నాయకత్వం లో పోరాటాలు నిర్వహించే విప్లవాలు సాధించటం జరిగిం దని, కార్మిక వర్గానికి ఒక దిక్సూచిగా పనిచేస్తుందని ఆయన అన్నారు. నియంతృత్వానికి, మతోన్మాద చర్యలకు పాల్పడుతూ ప్రజల్లో వైశమ్యాలను పెంచి తమ రాజకీయ అవసరాలను తీర్చుకోవటానికి పాలకులు ప్రయత్నం చేస్తున్న సందర్భంలో ఆ బావజాలానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు కావలసిన సాహిత్యం అందించాల్సిన అవసరం ఉందని భారతదేశాన్ని హిందూ రాజ్యాంగా మార్చాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తుందని లౌకిక ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలిపెట్టు వంటిదని దీన్ని ఐక్యంగా తిప్పికొట్టవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో ప్రజాపంథ జిల్లా నాయకులు సుధాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పి సుధాకర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కే నర్సింలు, నవతెలంగాణ జిల్లా మేనేజర్ సురేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేష్, సబ్బని లత, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు వై గంగాధర్, విగ్నేష్, కే గంగాధర్ ప్రజా సంఘాల నాయకులు రామ్మోహన్‌రావు, నరసయ్య, కే రాములు, ఈవీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబంతోనే 'బలగం'

- నగరంలో 'బలగం' చిత్రం యూనిట్ సందడి


నర్సింగ్‌పల్లి నుంచి ట్రాక్టర్‌పై థియేటర్‌కు వస్తున్న చిత్రబృందం


మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉమ్మడి కుటుంబాలు చీలిపోతున్నాయని, ఉమ్మడి కుటుంబ సభ్యులే 'బలగం' అని సినీ నటుడు నారాయణ మూర్తి అన్నారు. నిజామాబాద్ నగరంలో 'బలగం' చిత్ర బృందం సందడి చేసింది. నిర్మాత దిల్ రాజు సొంత గ్రామమైన నర్సింగ్‌పల్లి గ్రామం నుంచి ట్రాక్టర్‌లో మూవీ టీమ్ హీరో దర్శిత్, హీరోయిన్ కావ్య, నిర్మాతలు హర్షిత్‌రెడ్డి, హన్షిత, డైరెక్టర్ ఎల్దండి వేణు, రచ్చ రవి మూవీ యూనిట్ బృందం ట్రాక్టర్‌పై నగరంలోని విజయ్ థియేటర్ వరకు వచ్చి సందడి చేశారు. అనంతరం విజయ థియేటర్‌లో బలగం మూవీ ప్రీ రిలీజ్‌ను మంగళవారం చిత్రం యునిట్‌తో తిలకించారు. అభిమానులు హీరో ప్రియా దర్శి, హీరోయిన్ కావ్య నిర్మాతలతో సెల్ఫీలతో హోరెత్తించారు. అభిమానులు కాసర్ల శ్యాం రాసిన ఊరు పాట, బీమ్స్ సిసిరోలియో సంగీతం అలరించింది.

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. మా గ్రామమైన నర్సింగ్ పల్లి గ్రామస్తులతో కలిసి సినిమా ప్రీ రిలీజ్ సినిమా చుడటం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన మూవీ చూసి హాస్యాన్ని బాగా ఎంజాయ్ చేయాలని తెలిపారు. అనంతరం సిని నటుడు నారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో ఎవరికి వారే బిజీగా ఉంటూ.. ఉమ్మడి కుటుంబాలు చీలిపోతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో పల్లెటూరి వాతావరణం చూయిస్తూ ఉమ్మడి కుటుంబ సభ్యులే బలగం అంటూ మంచి సందేశాత్మకమైన చిత్రాన్ని అందజేసినందుకు డైరెక్టర్ వేణు, నిర్మాత దిల్ రాజు బృందాన్ని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కుక్కల దాడిలో మృతిచెందిన బాలుడి కుటుంబానికి పరామర్శ

- లక్ష రూపాయల ఆర్థిక సాయం.. ఆదుకుంటామని బాజిరెడ్డి జగన్ హామీ


బాలుడి కుటుంబీకులతో మాట్లాడుతున్న బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైదరాబాద్ లోని అంబర్‌పేట్‌లో కుక్కల దాడిలో మృతిచెందిన ఇందల్‌వాయి గ్రామానికి చెందిన బాలుడి కుటుంబాన్ని ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మంగళ వారం పరామ ర్శించారు. తనవంతు సాయంగా లక్ష రూపాయలు అందజేశారు. ఘటన వివరాలను బాలుడి తండ్రి గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలివెరి గంగాదాస్, సర్పంచ్ పాశం సత్తవ్వ నర్సింలు, ఎంపిటిసి మారంపల్లి సుధాకర్, సినియర్ నాయకులు పాశం కుమార్, ఆరటి రఘు, ఉప సర్పంచ్ లింగంపల్లి రాజేందర్ తదితరులున్నారు.

అందరి కృషితో ఆరోగ్య తెలంగాణ

- పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి
- సీఎంవో ముఖ్య కార్యదర్శి స్మిత సబర్వాల్


గర్భిణులతో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

ఆరోగ్య తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎంవో ముఖ్య కార్యదర్శి స్మిత సబర్వాల్ తెలిపారు. ఆరోగ్య కమిషనర్ భారతి హెూలికేరి, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతితో కలిసి కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలో మంగళవారం పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. హరిత హారం కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చామని, సాగునీటి కోసం ప్రాజెక్టులు నిర్మించుకు న్నామని, అన్ని రంగాలను అభివృద్ధి చేసుకోవాలంటే ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్య తెలంగాణ కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగా గర్భిణీలు ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. న్యూట్రిషన్ కిట్ల ద్వారా తల్లితో పాటు పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం అందజేస్తుందని ఆమె సూచించారు.

అనంతరం రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి శ్వేతా మహంతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం అయ్యే విధంగా అన్ని చర్యలు చేపట్టినట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి సిజరిన్ చేసు కుంటే భవిష్యత్తులో తల్లికి పుట్టబోయే బిడ్డకు అనారోగ్య సమస్యలు వస్తాయని, ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవం కోసం వైద్యులు ప్రయత్నిస్తారని, గర్భిణీలు ఓపికతో ఉంటే తల్లి బిడ్డ ఆరోగ్యంతో పాటు కెసిఆర్ కిట్టు అందుతుందని ఆమె వివరించారు.

పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల తల్లిదండ్రులకు అంగన్వాడీ టీచర్లు పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి తెలిపారు. న్యూట్రిషన్ కిట్లపై గర్భిణీలను అడిగి తెలుసుకు న్నారు. ప్రభుత్వం గర్భిణీలకు అందిస్తున్న న్యూట్రిషన్ కిట్లను గర్భిణీలే సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా తల్లి బిడ్డ క్షేమంగా, దృఢంగా ఉండాలని, రక్తహీనత లేకుండా ఉంటారని సూచించారు. పుట్టిన పిల్లల దగ్గర నుండి తల్లిపాలతో పాటు పెరిగిన సమయంలో పాలు తాగే అలవాటును నేర్పిం చాలని సూచించారు.

కంటి వెలుగు పరిశీలన

భిక్కనూర్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య పరీక్షలు చేసుకుంటున్న స్థానికులను అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని, అర్హులైన వారందరూ కంటి పరీక్షలు ఉచితంగా చేసుకోవాలన్నారు. అవసరమున్నవారికి కంటి అద్దాలతో పాటు, కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని, వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. వీరి వెంట జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, ఎంపీపీ గాల్‌రెడ్డి, పట్టణ సర్పంచ్ తునికి వేణు, జడ్పీటీసీ పద్మ నాగభూషణం గౌడ్, ఎంపీడీవో అనంతరావు, ఎమ్మార్వో ప్రేమ్ కుమార్, ఉపవైద్యాధికారులు చంద్రశేఖర్, శోభారాణి, మండల వైద్యాధికారి యేమిమా, ఐసీడీసీ అధికారిని రోహిష్మ తదితరులు పాల్గొన్నారు.

బీరప్పగుడికి రూ.20 లక్షల మంజూరు


ఎమ్మెల్యేకు గొంగడి కప్పిన కులస్తులు

- ఎమ్మెల్యేను సన్మానించిన కురుమ సంఘం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గ్రామంలో బీరప్ప గుడి నిర్మించేందుకు రూ.20 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తిర్మన్‌పల్లి గ్రామ కురుమ సంఘం సభ్యులు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను సన్మానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కుర్మ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కురుమ సంఘంలోని రెండు తర్పులకు రూ.10 లక్షలు త్వరలో మంజూరు చేయనున్నట్టు తెలిపారు. అంతకుముందు కురుమసంఘం సభ్యులు ఎమ్మెల్యేకు గొంగడి కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

26న పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష : ఎస్‌ఎఫ్‌ఐ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో ఈనెల 26 ఆదివారం శ్రీ గాయత్రి కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్టు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను పదును పెట్టే విధంగా మొదటిసారి బోర్డ్ ఎగ్జామ్ రాసే పదవ తరగతి విద్యార్థుల్లో భయాన్ని తొలగించే విధంగా ప్రతి సంవత్సరం అనుభవజ్ఞులైనటువంటి ఉపాధ్యాయులతో ప్రశ్న పత్రం రూపొందించబడుతుందని పేర్కొన్నారు. మెయిన్ ఎగ్జామ్స్ స్కోరింగ్ చేయడానికి కూడా ఈ పరీక్ష విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం ఉంటుందని పేర్కొన్నారు.

బీహార్ కార్మికులకు పురస్కారం సన్మానం

నవతెలంగాణ -నవీపేట్



మండలంలోని నందిగాం గ్రామంలో బీహార్ వలస కూలీలకు జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు, కౌలు రైతు ద్వవాడే సంజీవ్ ఐదువేల నగదు పురస్కారం అందించి మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస కార్మికులైన బీహార్ కూలీలు వరి నాట్లు వేస్తూ రైతులకు ఎంతో ఉపయోగకరంగా శ్రమిస్తున్నారని అన్నారు. అందుకే వారి దారి ఖర్చుల నిమిత్తం ఐదువేల రూపాయలతో పాటు సన్మానించామన్నారు. కార్యక్రమంలో రైతులు శోభన్, మహాదేవ్, శివరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేసిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంటగది, మూత్రశాల నిర్మాణం కోసం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు మంగళవారం భూమిపూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వంటగదికి రూ.4 లక్షలు, మూత్రశాలకు రూ.4 లక్షల రూపాయలు మంజూరైనట్లు మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, ఏంఈవో రాజేశ్వర్, పంచాయతీ రాజ్ ఏఈ షరీఫ్, పంచాయతీ సెక్రటరీ విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్, ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీమాన్, వార్డ్ సభ్యులు దినేష్, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేమ్ టు సేమ్



- నేడు కవలల దినోత్సవం
- గుర్తుపట్టడం కష్టమే

నవతెలంగాణ-ఆర్మూర్

లోకంలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని అంటారు.. అందులో ఎంతవరకు నిజం ఉందో తెలియదు కానీ ఒకే రూపంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు మాత్రం మనలో చాలామందిని చూశాం. నిజ జీవితంలో అద్దంలో మాత్రమే మన రూపాన్ని మనం చూసుకోగలం .అలాంటివి ఒకే పోలికతో ఉన్న ఇద్దరినీ చూస్తే ఆశ్చర్యపోవడం ఖాయం. వీరినే కవలలు అనే రూపం ఒకే వేషధారణలో ఉంటే వీరిని గుర్తుపట్టడం కష్టమే. చిన్నోడెవరో, పెద్దోడు ఎవరు కాస్త అయోమనానికి గురవుతాం. ఈనెల 22న బుధవారం కవలల దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ కథనం...

కవలల దినం నేపథ్యం...

పోలాండ్ దేశంలో నివసించే మేజర్ అరన్ విల్ కాక్స్ అనే కవల సోదరులు ఉండేవారు. వారు 1819 లో తాముంటున్న ప్రదేశానికి ట్విన్స్ బర్గ్ అని పేరు పెట్టారు. ఈ కవల సోదరులు ఇద్దరు అక్కాచెల్లెళ్లను వివాహం చేసుకున్నారు. వారిద్దరూ ఒకే రకమైన వ్యాధితో ఒకే రోజున మృతి చెందారు. వారిద్దరిని ఒకేసారి ఖననం చేయడం జరిగింది. వీరి సంస్మరణార్థం 1976 సంవత్సరం నుండి ఫిబ్రవరి 22న కవలల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆన వాయితీగా వస్తుంది.

అరుదైన పరిస్థితుల్లో..

ఒకే తల్లికి ఒకసారి పుట్టిన బిడ్డలుగా చాలా అరుదైన పరిస్థితుల్లోనే కవలలుగా జన్మిస్తారు. కవల పిల్లల్లో ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు, ఒక ఆడ, మగ పిల్లలు పుట్టడం జరుగుతుంది. కవలలుగా జన్మించిన వారు ఒకే పోలికతో ఉంటే మినీ జై గో టు యు, వేరువేరు పోలికలతో ఉంటే డైసిగేటివ్‌గా వ్యవహరిస్తారు. గర్భంలో ఇద్దరు పిల్లలు శరీరాలు కలిసిపోయి జన్మిస్తే వారిని అవిభక్త కవలలుగా పిలుస్తారు. వాణి, వీణలు అవిభక్త కవలలుగా జన్మించారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది కవల పిల్లలు పుడుతున్నట్టు అంతర్జాతీయ సంస్థ నిర్వహించిన సర్వే చెబుతుంది. ఒకే తల్లికి జన్మించిన కవలలు ఒకరికి ఒకరు ఆత్మీయత బంధంతో ఉంటారు. తల్లిదండ్రులు కవలలను చిన్నప్పటి నుంచి ఒకే రకమైన దుస్తులను ధరింప చేస్తూ తేడా లేకుండా పెంచుతారు. పుట్టిన రోజులు, పండుగలు పర్వదినాలకు ఒకే దుస్తులు వేసి సంబరపడి పోతారు. కవల పిల్లల్లో ఒకరికొకరికి పోటీ తత్వం ఉంటుందని సైన్స్ చెబుతోంది. చిన్న వయసులో ఉన్న పిల్లలు వారి ముద్దులు, మురిపాలు మరింత ఎక్కువవుతాయి.

ఇద్దరూ ఉద్యోగాల్లో..



జక్రాన్ పల్లి మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన సైదు రాము, లక్ష్మణ్ లు చిన్నప్పుడు ఒకే రంగు డ్రెస్సులు వేయడంతో ఎవరు రాము, ఎవరు శ్యాము గుర్తుపట్టడం కష్టం అయ్యేది.. ప్రస్తుతం రాము ఇందల్వాయి మండల గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తుండగా, లక్ష్మణ్ కేశ్ పల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జిటి ఉపాధ్యాయునిగా కొనసాగుతున్నారు.

ప్రజాసేవలో ఒకరు, విద్యాబోధనలో మరొకరు..



పట్టణంలోని మామిడిపల్లి 24వ వార్డు కౌన్సిలర్ ఆకుల రాము, లక్ష్మణ్ కవలలు. రాము కాలనీ అభివృద్ధిలో నిర్విరామ సేవలు చేస్తుండగా లక్ష్మణ్ బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలకు కరస్పాండెంట్ కొనసాగుతున్నారు.. ట్విన్స్ డే ను గుర్తు చేసుకుంటూ కొత్త అనుభూతిని పొందుతున్నామని తెలిపారు.

ప్రాణాలు కాపాడిన ఆశ ఆసుపత్రి

నవతెలంగాణ-ఆర్మూర్



ఉచిత వైద్యం చేసిన పేషెంట్

పట్టణంలోని పెర్కిట్ రోడ్డులో గల ఆశ సూపర్ ఆసుపత్రి వైద్యులు శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మానవతా దృక్పథంతో ఒక పేషంటు ప్రాణాలు కాపాడి ఉచిత సేవలు అందించారు. నిర్మల్ జిల్లా ఇచ్చోడకు చెందిన నందిని అనే మహిళ పాయిజన్ తీసుకొని ఎమర్జెన్సీలో అడ్మిట్ చేసుకొని వెంటిలేటర్‌పై ఐదురోజులు చికిత్స చేశారు. పది రోజులు అడ్మిట్ చేసుకుని ప్రాణాలు కాపాడి పంపించారు. సుమారుగా లక్ష రూపాయలు ఆస్పత్రి బిల్లు కాగా, వారి ఆర్థిక పరిస్థితి చూసి బిల్లు మొత్తం మాఫీ చేసి మంగళవారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆశ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యందు సహచర వైద్యులు సైతం నిర్విరామ సేవలు చేస్తూ 24 గంటలు అందరికీ అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లత

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సింగంపల్లి గ్రామంలో ఎంపీపీ లతా కన్నిరామ్ సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ లత మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే గ్రామాలకు మహర్దశ వచ్చిందని రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రతి గ్రామంలో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాముఖ్యతనిస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆమె కొనియాడారు. పింఛన్, రైతు బీమా, రైతు బంధు పథకాలు మన రాష్ట్రానికి గర్వకారణమని, ఇలాంటి పాలన దేశంలో ఏ రాష్ట్రంలో లేదని భారతీయ రాష్ట్ర సమితి అంటే సంక్షేమ పథకాల సమితిని ఆమె కొనియాడారు. ధాన్యం ఎగుమతిలో మన రాష్ట్రం ప్రథమ స్థానానికి చేరుకుంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లికొండ రమేష్, సర్పంచ్ కొల గంగాధర్, ఉప సర్పంచ్ ఎండి గౌసుద్దిన్ పంచాయతీ సెక్రెటరీ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పలువురు బాధితులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురెందర్ మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఇటీవల వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరు చేయించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగంనాయక్, కోఆప్షన్ మెంబర్ పర్స నవీన్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రాష్ట్రసీనియర్ మహిళల సాఫ్ట్ బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర సీనియర్ సాఫ్ట్ బాల్ మహిళల ప్రాబబుల్స్ జట్టు శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిచ్‌పల్లి మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు రాజేందర్ గౌడ్ పాల్గొని శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. మార్చ్ 3 నుండి 5 వరకు తమిళనాడు రాష్ట్రంలోని తిరుచూరపల్లిలో జరగనున్న సీనియర్ సౌత్‌జోన్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి నరేష్ చంద్ర మాట్లాడుతూ క్రీడాకారులకుఉన్నత విద్య, ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ఉన్నందువలన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణ పెంపొందుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోదావరి, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లూరి లత, సురేష్, సాఫ్ట్బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక పాల్గొన్నారు.

రైల్వే నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్-జాంకంపేట రైల్వే స్టేషన్ల మధ్య రైళ్లపై రాళ్ల దాడికి సంబంధించిన అవగాహన కార్యక్రమం సిబ్బందితో కలిసి నిజమాబాద్-జాన్కంపేట్ రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం నిర్వహించారు. స్టేషన్, సమీపంలోని ట్రాక్‌లో నివాసాల్లో బ్యానర్‌లను ప్రదర్శించారు. రాళ్లు రువ్వడం రైల్వే చట్టంలోని సెక్షన్‌ల ప్రకారం శిక్షార్హమైన నేరమని, భారతీయ రైల్వే చట్టం ప్రకారం కఠిన చర్యలకు అర్హులని వారిపై క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని తెలిపారు. వారికి భవిష్యత్తులో ఉద్యోగాలు, ప్రభుత్వ పరంగా ఎటువంటి లాభాలు ఉండవని వారికి వివరించారు. ఈ రైల్వే ఆస్తులు మన భారతదేశ ప్రజలందరి ఆస్తి అని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిది అని తెలిపారు. ఎవరైనా ధ్వంసం చేస్తే సమాచారం అందివ్వాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. కార్యక్రమాన్ని రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వివి సుబ్బారెడ్డి, ఎస్సై ప్రవీణ్ కుమార్ నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఖానాపూర్ గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఖానాపూర్ గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు మహిళా సంఘ నాయకురాలు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనులు జరుగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు చాబంతి సుధా చారి, ఉపాధ్యక్షులు సంతోష్, సాయన్న, మహిళా సంఘ సభ్యురాలు లక్ష్మీ, అక్కంపల్లి పద్మ ,వనజ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ అండ్ చెక్కులు పంపిణీ



సర్పంచ్‌కు సీఎంఆర్ఎఫ్ అందజేస్తున్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రానికి చెందిన అరుణ్‌కు రూ. 24వేలు పి. సుష్మకు 13వేలు, చిల్కురి మహేష్‌కు రూ. 14వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ వీజీగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కేసుపల్లి సర్పంచ్ మహేశ్వర్, ఎంపీటీసీ గంగాధర్, జక్రాన్‌పల్లి ఎక్స్ సర్పంచ్ కటపల్లి నర్సారెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేసుపల్లి సర్పంచ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మండలంలోని కేసు పల్లి గ్రామ సర్పంచ్ మైదాం మహేశ్వర్‌కు లక్ష 25వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్సీ విజి గౌడ్ మంగళవారం అందజేశారు. మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఎంపీపీ, వైస్ ఎంపీపీ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేశపల్లి ఎంపిటిసి మున్నూరు గంగాధర్, జక్రాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను బూత్ స్థాయిలో బలోపేతం చేస్తాం

- మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నందిపేట్

రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేస్తామని మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం నందిపేట్ మండల కేంద్రంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేపట్టిన హాత్‌సె హాత్ జోడో పాదయాత్రలకు మద్దతుగా పార్టీ జెండాను ఆవిష్కరించి పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాదయాత్ర ముఖ్య ఉద్దేశ్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా వైఫల్యాలను ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను ఇచ్చిన హామీలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నేరవేర్చక కళ్ళబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేస్తుండడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను తీర్చలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందన్ జనరల్ సెక్రెటరీ గడుగు గంగాధర్, మండల నాయకులు మంద మహిపాల్, పెంట ఇంద్రుడు, గంగా రెడ్డి, వెంకటేశ్వర్ రావు, జీవన్, ప్రశాంత్, పోశెట్టి ,రవి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు

సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న సర్పంచ్ పద్మ

గ్రామ పంచాయతీ నుండి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని హాసకొత్తూరులో గ్రామ పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో గ్రామంలో నూతన గృహ నిర్మాణ అనుమతుల గురించి చర్చించారు. గ్రామంలోని మేస్త్రి ల యూనియన్ సభ్యులందరినీ పిలిపించి అనుమతి పత్రంలో చూపించిన దానిని అతిక్రమించి పనులు చేయవద్దని సర్పంచ్ సూచించారు. గ్రామంలో ఎటువంటి నిర్మాణం చేయాలన్న గ్రామ పంచాయతీ నుండి అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి పత్రం లేకుండా ఇంటి నిర్మాణం పనులు చేపడితే ఇంటి యజమానులతో పాటు మేస్త్రీలపై పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి తెలిపారు. ఎవరైనా పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేయాలని మేస్త్రీలపై ఒత్తిడి తెస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న పలు నూతన గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనుమతి పత్రంలో చూపించిన దానికి మించి ర్యాంప్ లు, మెట్లు బయటకు వచ్చిన ఇంటి నిర్మాణాలను నిలిపి వేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, వార్డు సభ్యులు ఈర్ల ఆనంద్, కుందారం శ్రావణ్, సట్ల సరిత, మాధురి, లక్ష్మి, లావణ్య, నవీన్, జూనియర్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

పలు క్రీడల్లో విజయ్ విద్యార్థులకు పతకాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్



పతకాలు సాధించిన విద్యార్థులు

6వ జాతీయస్థాయి యూత్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ - 2023, ట్రెడిషనల్ యూత్ గేమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మున్సిపల్ ఇండోర్ స్టేడియం వరంగల్‌లో ఈనెల 17 నుండి 19 వరకు క్రీడలు నిర్వహించారని తెలిపారు. ఖో-ఖో అండర్-17 బాలుర విభాగంలో బంగారు పతకం, హ్యాండ్‌బాల్ బాలబాలికల విభాగంలో బంగారు పతకాలు, వాలీబాల్ క్రీడలో తొమ్మిదవ తరగతి విద్యార్థి వి.శ్రీకర్, డి.ధీరజ్ బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెం బాలికల విభాగంలో శ్రీ వైష్ణవి, బాలుర విభాగంలో సూర్య చరణ్ తేజ 400 మీటర్ల పరుగు పందెంలో, బాలుర లాంగ్ జంప్‌లో నిహార్ రెడ్డి, హై జంప్‌లో పి. సాయి చరణ్‌కు బంగారు పతకాలు, లాంగ్ జంప్‌లో కార్తీక్‌కు రజత పతకం వచ్చాయని తెలిపారు. యోగా విభాగంలో 5 బంగారు, 5 రజత పతకాలు సాధించారని తెలిపారు. అత్యధిక పతకాలు సాధించిన తమ పాఠశాలకు ట్రోఫీని అందజేశారని కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులు ఏ.శ్రీకాంత్, వెంకటేష్, పద్మలత, యోగా శిక్షకురాలు రజిత ను కార్యదర్శి డా?అమృతలత, కరస్పాండెంట్ ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపల్ విజేత అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

రేపు క్రయ, విక్రయాలు బంద్

- మర్చెంట్ అసోసియేషన్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న మర్చంట్ అసోసియేషన్ సభ్యులు

రేపు క్రయ, విక్రయాలు బంద్‌కు రైతులు సహకరించాలని ది నిజామాబాద్ మార్చెంట్ అసోసియేషన్ అధ్యక్షులు లాభిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి గోపాల రమేష్, ప్రధాన కార్యదర్శి కమల్ కిషోర్ తెలిపారు. మంగళవారం నగరంలోని శ్రద్దానంద్ గంజ్‌లో గల మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖరీద్ దారులు రైతులకు చెల్లించాల్సిన అమ్మకపు విలువలో టాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్ (టీసీఎస్) చేసి ఇస్తున్న దాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అడ్తి దారుల సంఘం పిలుపు మేరకు 23న క్రయవిక్రయాలు బంద్ పాటిస్తున్నామని తెలిపారు. గురువారం బంద్‌కు రైతులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము ట్రేడర్లం కామని194 క్యూ సెక్షన్ ప్రకారం మినహాయింపు ఇవ్వాలని, బులియన్ మార్కెట్లోని దళారుల పైననే పన్ను మినహాయింపు ఇవ్వడం జరిగిందని అన్నారు. అటువంటిది రైతులకు సహకారం అందించే టీసీఎస్ వేయడం సమంజసం కాదని వారన్నారు. లక్షకు 0.1శాతం చొప్పున వేయించడం వరకైతే ఇబ్బంది లేదని వారన్నారు. సమావేశంలో మాస్టర్ శంకర్, హనుమంత్ యాదవ్, మల్లేష్, గణేష్, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి భౌతిక రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల విద్యార్థులు, 46మంది గైడ్ టీచర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిసిసిబి సెక్రెటరీ సీతయ్య, ఎంఈఓ రాజా గంగారం పాల్గొని గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

- తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న యాదనాయక్

మార్చ్ 6న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదవ్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం నిజామాబాద్ సీఐటీయూ జిల్లా కార్యాలయంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదవ్ నాయక్ హాజరై మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు, ఈసీఏఎన్. ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్, ఏఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్ఆర్డి ఏఎన్ఎంలు, ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలను యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లబీళి మార్చి 6న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ లోపనిచేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎంలకు విజ్ఞప్తి చేశారు. వైద్య ఆరోగ్య రంగానికి బలమైన ఆయువు పట్టుగా ఉండి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న నేటికీ రెగ్యులర్ కాకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు, ఏఎన్ఎంలు ఏకకాలంలో 36 రకాల రికార్డులు ఆన్‌లైన్, ఆఫ్ లైన్ లో నమోదు చేస్తున్నారని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైద్య ఆరోగ్య పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని అన్నారు. 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఏఎన్ఎంలకు 8,9,10 పి.ఆర్.సి ల ప్రకారం బేసిక్‌పే ఇచ్చారు. కానీ ప్రస్తుతం తెలంగాణలో తొలి పీఆర్సి బేసిక్‌పే ఇవ్వకుండా 30శాతం వేతనాలు పెంచడం వల్ల ఏఎన్ఎంలు ప్రతినెలా 5 వేల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బేసిక్‌పై ప్రకారం వేతనాలు పెంచి ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే వీరందరిని ఎలాంటి షరతులు లేకుండ యధావిధిగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కారం చేయకుంటే మార్చి 6న కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ జిల్లా నాయకులు వేణుగోపాల్, ప్రవీణ్ రెడ్డి, పుష్ప, సంధ్య, గంగా జమున, కవిత, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ బీమన్‌పల్లి లక్ష్మి నారాయణ మంగళవారం ప్రారంభించారు. రూ.5 లక్షలు మంజూరు కావడంతో పనులను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగారాం, విఠల్, భానుప్రసాద్, సిద్ధగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న రోడ్డు పనులు

ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటకు చెందిన మంగళ్ వంశీ ఇండియన్ ఆర్మీకి ఎంపికైన సందర్భంగా గ్రామంలో శివాజీసేవ సమితి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్మీ జవాన్లు గాంధ్ర అంజయ్య, బండి శేఖర్, చిన్న భాస్కర్‌రెడ్డి, నరేష్, అశోక్, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వంశీని సన్మానిస్తున్న పలువురు

చివరి గింజవరకూ కొనుగోలు చేస్తాం

- మార్క్‌ఫెడ్ చైర్మెన్ మార గంగారెడ్డి
- పలుచోట్ల శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్/రెంజల్/బోధన్

శనగలను చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ చైర్మెన్ మార గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా ఎరువుల గురించి ఆందోళనలు చెందవద్దని రైతులకు సూచించారు. రైతులు తొందరపడి ప్రయివేటు వ్యక్తుల వద్ద అధిక ధరకు కొనవద్దని తెలిపారు. యూరియా కోసం వ్యవసాయ మంత్రితో మాట్లాడి తెప్పిస్తామని అన్నారు. శనగలు 90 రోజుల వరకు కొనుగోలు చేస్తామని వివరించారు. కామారెడ్డి జిల్లాలో మొత్తం 14 శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గైని అనుసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్‌లు కమలాకర్ రావు, గంగాధర్, సదాశివరెడ్డి సాయికుమార్, డీసీఓ భాగ్య లక్ష్మి, రైతు కన్వీనర్ భూంరెడ్డి, సీఈఓ విగ్నేష్‌గౌడ్, డైరెక్టర్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రమైన రెంజల్ సింగిల్ విండో ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ మొయినుద్దీన్, జెడ్పీటీసీ మేక విజయ సంతోష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండించిన శనగ పంటకు మద్దతు ధర రూ.5,335ను ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని వారు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, డైరెక్టర్లు అగ్గు నారాయణ, ఖదీర్ భాష, సాయిరెడ్డి, సాయిలు, చంద్రకళ, రైతుబంధు జిల్లా నాయకులు ఎండీ మౌలానా, బోర్గాం ఉపసర్పంచ్ ఫిరోజ్దీన్, సికిందర్, భూమారెడ్డి, మేత్రి రాజు, మోసిన్‌బేగ్, గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్, సాయిరెడ్డి, సొసైటీ కార్యదర్శి రాము, స్థానిక రైతులు పాల్గొన్నారు.


సదాశివనగర్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


బోధన్‌లో..

రైతుల సౌకర్యం కోసం కొనుగోలు కేంద్రాలు..

బోధన్ : రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని కావున రైతులు శనగ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సాలూర సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్ అన్నారు. మంగళవారం సాలూర సొసైటీలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి శనగలను విక్రయించి నష్టపోవద్దని సూచించారు. నాణ్యమైన శనగలను రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, ప్రభుత్వం క్వింటాలు శనగలకు రూ.5335 మద్దతు ధర చెల్లిస్తామని కనుక రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాలూర మండల కేంద్రంలో శనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం పరిధిలోని సర్పంచులు భుయ్యాన్ చంద్రకళ రాజప్ప, ఇంచార్జి ఏడీఏ సంతోష్, సంఘం డైరెక్టర్లు సంగేపు భూమయ్య, జి.హెూట్లప్ప, బి.దేవేందర్ పటేల్, సొసైటీ కార్యదర్శి బస్వంత్ రావు పటేల్, ఏఈఓ అపర్ణ, రైతులు రమేష్, లింబయ్య, సాయి రెడ్డి, లక్ష్మణ్, వీరేష్, గంగాధర్, అశోక్, ఖదీర్ సిబ్బంది పాల్గొన్నారు.

హున్స సొసైటీలో..

సాలూర మండలంలోని హున్స సొసైటీలో సొసైటీ చైర్మెన్ బుచ్చల్ వార్ రవి శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఏడీఏ సంతోష్, ఏఈఓ ఉమా, సీఈఓ అనీల్ కుమార్, వైస్ చైర్మెన్ వినోద్ బాబా, గ్రామ పెద్దలు చీల గంగారాం, నాగరాజ్, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ఆదర్శ బాలికల వసతి గృహంలో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తిగల అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ బాలికల వసతి గృహం ఎస్ఓ శ్యామల కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22, 23, తేదీలోపు ఆదర్శ బాలికల వసతి గృహంలో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమోలు, ఏఎన్ఎం అండ్ జీఎన్ఎం ట్రెయినింగ్ సర్టిఫికెట్లు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఘనంగా మస్తాన్ షావలి ఉర్సు


ఉర్సులో పాల్గొన్న ముస్లింలు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో గల మస్తాన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొలగల్లికి చెందిన మమ్మద్ ఖలీముద్దీన్ ఇంటి నుంచి మొదలైన మస్తాన్ షావలి సందల్ గంధము చెద్దరు పువ్వులు జెండా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ముస్లిం సోదరులు ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం మస్తాన్ షావలి దర్గాకు సందల్ గంధం, పువ్వులు, దట్టీలు సమర్పించారు. జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బ్యాండ్ మేళాలతో ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో మదర్సా అధ్యక్షులు ఫారుక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతీయోద్దీన్, హర్షద్, రాషద్, తదితరులు పాల్గొన్నారు.

భవానీపేట్‌లో నేటి నుంచి పెద్దమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవ వేడుకలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని భవానీపేట గ్రామంలో మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టపన మహెూత్సవాన్ని నిర్వహించనున్నట్టు భవానీపేట ముదిరాజ్ సంఘం సభ్యులు తెలిపారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నందు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రాధిక, తెలుగు తల్లి, దాశరథి, సింగిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి సత్కరించారు. కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ ఆర్.ఉదయిని మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. జువాలజీ అధ్యాపకురాలు ఎండీ. అఫశా మాతృభాషకు ఉన్న ప్రత్యేకతలను గురించి తెలిపారు. విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.మాణిక్యరేఖ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

నవతెలంగాణ-పిట్లం


ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని పంచాయతీ సెక్రటరీ యాదగిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటి పన్ను స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పై అధికారుల ఆదేశానుసారం పంచాయతీ పరిధిలోని నివాస గృహ యాజమానులు తమ ఇంటి పన్ను బకాయిలను సత్వరమే చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మరగల దయానంద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

గర్భిణులు న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శారదా, జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిరుమల్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శారదా నాగరాజు, వైస్ ఎంపీపీ పుట్ట బాపురెడ్డి, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, ఎంపీటీసీ కదారి రమేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంధ్ర మధుసూదన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, కోఆప్షన్ సభ్యుడు షమ్మీ, నాయకులు మన్నె సాయిరెడ్డి, ఐరేని నరసయ్య, వైద్యురాలు భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం


వైస్‌చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావ్ పటేల్‌ను గ్రామ ప్రజా ప్రతినిధులతో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులుతో మంగళవారం పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, మలుగొండ, సంజీవ్, రాములు, ఉప సర్పంచ్ పండరి, గులబ్‌రావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

- బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని బీజేపీ నేత, ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండి మాసానిపేట గ్రామంలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు.

ఘనంగా వీరభద్ర స్వామి జాతర

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో వీరభద్ర స్వామి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పండుగ అయిన మూడవరోజు వీరభద్రుడి జాతర ఇక్కడ కొనసాగడం ఆనవాయితీగా వస్తోంది. మండలంలోని రెంజల్, వీరన్న గుట్ట, కళ్యాపూర్, దండిగుట్ట, వీరన్నగుట్ట తండా గ్రామాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేశారు. రెంజల్ ఎస్ఐ సాయన్న భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 6:45 నిమిషాలకు రథంపై వీరభద్రుడి విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. భక్తులు పేలాలతో స్వాగతం పలుకుతూ రథాన్ని ముందుకు లాగారు. పూజారి నాగనాథప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వీరన్నగుట్టలో జాతర సందడి

వీరభద్ర స్వామి ఆలయం వద్ద అన్నదానం..

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయం ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతియేటా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు సర్పంచ్ బైండ్ల రాజు పేర్కొన్నారు. ఏఎస్ఐ ముక్తేశ్వరరావు వంటకు సరిపడా బియ్యాన్ని అందజేయగా, ఆలయ కమిటీ మరికొంత డబ్బును సమకూర్చి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమంలో స్థానిక పెద్దలు రాయనర్సు, బాబా, భీమరాజు, సాయిలు, గురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైతులు అధికారుల సలహాలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ-పిట్లం

రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని చిల్లర్గి గ్రామ వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి పంటలో మొగి పురుగు, అగ్గి తెగులు ఆశించినట్టు ఆమె పేర్కొన్నారు. మొగి పురుగు, అగ్గి తెగులు నివారణకు గాను కార్టాఫ్ హైడ్రోక్లోరిడ్ 250 గ్రాములు, ట్రై సైక్లోజల్ 120 గ్రాముల మందును ఒక ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. యూరియాను తక్కువ మోతాదులో వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయిని రమేష్, ముల్తానీ, సాయిలు, వీఆర్ఏ సత్యం, సాయిలు, అర్జున్, హన్మండ్లు, వ్యవసాయ విస్తీర్ణ అధికారిని కావేరి తదితరులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి

పీడిత ప్రజలకు అండగా న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-బోధన్

పీడిత ప్రజలకు అండగా న్యూడెమోక్రసీ పార్టీ ఉంటుందని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎర్రజెండా నాయకత్వంలో దేశంలో, రాష్ట్రంలో అనేక పోరాటాలు నిర్వహించినట్టు తెలిపారు. భూపోరాటాలు నిర్వహించి ప్రజలకు లక్షల ఎకరాల భూములను పంచామన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అవినీతి జోరుగా సాగుతుందన్నారు. సాలురా నూతన మండలానికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బోధన్-నర్సి రోడ్డులో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ బోధన్ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య, పార్టీ, ప్రజా సంఘాల నాయకులు షేక్ నజీర్, దేవదాసు, సంగెపు సాయిలు, సురేష్, పి.సాయిలు, బంటు పోశెట్టి, నాగయ్య, లక్ష్మణ్‌గౌడ్, నారాయణ, గంగారం, బి.లక్ష్మణ్, పద్మ, సావిత్రి, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని పద్మాజీవాడి చౌరస్తాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం పాఠశాలను పర్యవేక్షించకపోవడంతో ఉపాధ్యాయుల ఇష్టారాజ్యాంగా మారింది. పాఠశాల 9:30కి ప్రారంభమవగా.. ఈ పాఠశాలలో విధులు నిర్వహించే ఓ ఉపాధ్యాయురాలు సుమారు 10:30 గంటలకు విధులకు హాజరైంది. ఏ ఉపాధ్యాయులు ఏ సమయానికి వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అఖండ హరినామ సప్త ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రఖ్యాత గాంచిన సోమ లింగాల గుడి గుట్ట వద్ద అఖండ హరినామ సప్తను మంగళవారం ప్రారంభించారు. సప్త కార్యక్రమం వారం రోజులపాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. రోజువారి కార్యక్రమంలో భాగంగా భజన కీర్తన కోసం ముఖ్య మహారాజులు రోజుకొకరు చొప్పున కీర్తన వినిపించడానికి నిర్వాహకులు రోజువారి కార్యక్రమాలు చేపడుతున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల రుణమాఫీ చేస్తాం

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గాంధారీ మండల కేంద్రంలో హత్ సేహత్ జోడో కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కామెల్లి బాల్‌రాజ్, లైని రమేశ్, మోహన్ నాయక్, ఎండీ మదార్, సంగెం రాజు, బద్దం వెంకట్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, సంతోష్, శేఖర్, శివరాజ్, బి.సాయిలు, బాల్‌రాజ్ రెడ్డి, శ్రీనివాస్, గాంధారి కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జోడో అభియాన్

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ఏత్తొండ క్యాంప్, రాంపూర్ గ్రామంలో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల బాలరాజ్ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్‌లో మంగళవారం పాల్గొన్నారు. గడపగడపకూ తిరుగుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ కలిగిస్తుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పతనం తప్పదని పేర్కొన్నారు. ఆయన వెంట కోటగిరి ఎంపీటీసీ మనోహర్, మాజీ ఎంపీపీ పవన్ కుమార్, నాయకులు అరుణ్ కుమార్, ఖలీక్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ కుస్తీపోటీలు


తలపడుతున్న మల్లయోధులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మహాశివరాత్రి సందర్భంగా ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం కుస్తీపోటీలు నిర్వహించారు. గ్రామంలో ఉమాసంగమేశ్వర ఆలయం వద్ద నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ కుస్తీపోటీలు నిర్వహించామని సర్పంచ్ మామిడి దామోదర్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు స్థానికులే కాకుండా జిల్లా నుంచి పలు మండలాల, గ్రామప్రజలు తరలివచ్చారు. టెంకాయ కుస్తీ నుంచి వెండికడెం వరకు గెలుపొందిన వారికి నగదు, వెండికడెం బహుకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మకు ఘనంగా బోనాలు


బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని సోమార్‌పేట్ గ్రామ శివారులో గల పటేల్ చెరువు మైసమ్మకు గ్రామస్తులు మంగళవారం బోనాలు తీశారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇండ్ల నుంచి అందంగా తయారుచేసిన బోనాలతో భాజాభజంత్రీల చప్పుళ్ల మధ్య, శివసత్తుల నృత్యాల మధ్య మైసమ్మ ఆలయం వరకు చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. సర్పంచ్ ఇందిరా అంజాగౌడ్, ఉప సర్పంచ్ హనుమంత్‌రెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు గొల్లేన మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి


ఎంపీతో పాలకవర్గం సభ్యులు

నవతెలంగాణ-జుక్కల్

గ్రామాభివృద్ధికి నిధులను కేటాయించాలని కోరుతూ నాగల్‌గావ్ సర్పంచ్, జీపీ పాలకవర్గం సభ్యులు కలిసి మంగళవారం హైదారాబాద్‌లో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నాగల్‌గావ్ సర్పంచ్ కపిల్ పటేల్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి జరిగినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని, కావున నిధులను కేటాయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వార్డు సభ్యులు నాగురావ్, బాలాజీ, సురేష్, మధుకర్, విఠోబా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని వడ్లం గ్రామంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి సీసీ రోడ్డు పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ శాసనసభ్యులు హన్మంత్ షిండే సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుంతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ నగేష్ మల్లుగొండ, ఉప సర్పంచ్ పండరి, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావ్ పటేల్, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య, మాజీ సర్పంచ్ పోశయ్య, పార్టీ నాయకులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక, మానసిక సమస్యలపై అవగాహన

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దీర్ఘకాలిక, మానసిక సమస్యలతో పాటు మనోవైకల్యం, ఫిట్స్, ద్విధ్రువ ప్రభావిత రుగ్మత, నిరాశ, ని స్పృహ, ఆత్మహత్యల ప్రేరేపిత ఆలోచనలపై వైద్యులు రమణ మంగళవారం అవగాహన కల్పించారు. గంజాయి, మాదకద్రవ్యం, ఆల్కహాలు వంటి మత్తు పదార్థాలను మాన్పించడం కోసం ప్రత్యేక చికిత్స కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా, జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయంలో మానసిక ఒత్తిడి, ఆరోగ్య పరిరక్షణ, ప్రణాళిక ప్రకారం చదువుకొని తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సురేష్, డాక్టర్ రాహుల్, సిబ్బంది భీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వరి వంగడాలపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో సిరిసిల్ల వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు రైతులకు నూతన వరి వంగడాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ విద్యార్థులు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వారు నూతన వరి వంగడాలను విడుదల చేశారని, నూతన వరి వంగడాల విత్తనాలపై అవగాహన, వాటి దిగుబడి, విత్తన రకాలు, వాటి ప్రత్యేక లక్షణాలపై రైతులకు అవగాహన కల్పించినట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు శివకుమార్, చిరంజీవి, జయవర్ధన్, రోహిత్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యలో తెలంగాణ ముందంజ

- రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



వీసీని సన్మానిస్తున్న దృశ్యం

శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో వైద్య విద్యా రంగంలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ అర్. లింబద్రి తెలిపారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో ఇన్నోవేషన్ ఇన్ బయోలజి అండ్ మెడిసిన్ 'అనే అంశంపై మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సెమినార్ ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రిక్క లింబాద్రి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ చరిత్రలో బయోటెక్నాలజీ విభాగంలో ఇంత పెద్ద ఎత్తున సెమినార్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కరోనా సమయంలో ఎందరో శాస్త్రజ్ఞుల కృషితో వ్యాక్సిన్ కనుగొనడంతోనే దేశ ప్రజలకు వ్యాక్సిన్ లభ్యమైందని పేర్కొన్నారు.

హైదరాబాద్లో ఫార్మారంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, దేశానికి కావలసిన ఔషధాలను హైదరాబాద్ నుంచి తయారు చేయడం గొప్ప విషయమని అయన అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణలో కేవలం ఆరు మెడికల్ కళాశాలలు మాత్రమే ఉండేవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 34 కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. దేశంలో అత్యధిక మెడికల్ కళాశాలలు రాష్ట్రంలోనే ఉన్నాయని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి వేగంగా విస్తరిస్తుందని, సైంటి స్టులు ఔషధాలు కనుక్కుని క్యాన్సర్ వ్యాధిని విస్తరించకుండా చూడాలని లింబద్రి సూచిం చారు. ఈ సెమినార్‌లో విదేశాలకు చెందిన సీనియర్ సైంటిస్టులు, ప్రొఫెసర్ హాజర య్యారని, మాజీ వైస్ చాన్స లర్, హెచ్ సి యు, ప్రొఫెసర్ పి. అప్పారావ్ హాజరవుతున్నారని వీరందరూ రావడం గర్వకారణంగా ఉందని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వైస్ ఛాన్స లర్ ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ ప్రముఖ సైంటిస్టులు, వ్యాక్సిన్లు కనుగొన్న శాస్త్రవేత్తలు ఈ సమావేశానికి హాజరు కావడం తెలంగాణ యూనివర్సిటీకి గర్వకారణంగా ఉందని తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్ ఫెడరిక్, అమెరికా జీబ్రా ఫిష్ నుండి క్యాన్సర్ నివారణ మందును తయారు చేయవచ్చని తెలిపారు. అమెరికాకు చెందిన శాస్త్రవేత్త పియా డి ఓగల్ రక్త, మెదడు, బ్రెస్ట్, ప్రొస్టేడ్ లకు వచ్చే క్యాన్సర్ నివారణలో మందుల తయారీ, వాటి ఉపయోగాలను వివరించారు. అమెరికాకు చెందిన జే బాబు రామాపురం మందుల తయారీలో 3డీ నమూనాలను తయారు చేసే విధానాన్ని వివరించారు. అనంతరం రీతు చక్రవర్తి (వ్యాక్సిన్ కనుగొన్న శాస్త్రవేత్త), డాక్టర్ మహేందర్ తుడి, ప్రొఫెసర్ జె.ప్రకాష్, ప్రొఫెసర్ మోనాలిసా ముఖర్జీ (డిఎస్ టీ డైరెక్టర్), రిజిస్టార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ఆరతి, సైన్స్ డిన్ ప్రొఫెసర్ అరుణ, ఈ సెమినార్ కన్వీనర్ ప్రవీణ్ మామిడాల, హెచ్ ఓ డి జావేరియా ఉజ్మ, అధ్యాపకులు డాక్టర్ మహేందర్ రెడ్డి, కిరణ్మయి, ప్రసన్న షీలా, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశోధక, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలి

నవతెలంగాణ-ఎడపల్లి

2015 కంటే ముందు ఆధార్ నమోదు చేసుకున్న రైతులు తమ ఆధార్ కార్డును మీసేవా కేంద్రాల్లో అప్‌డేట్ చేసుకోవాలలి మండల వ్యవసాయాధికారి సిద్ధి రామేశ్వరరావు బుధవారం తెలిపారు.

పనులు కల్పించేందుకు చర్యలు చేపడతాం

- సామాజిక తనిఖీ సభలో సర్పంచ్ సురేష్

నవతెలంగాణ-మద్నూర్


సామాజిక సభలో పాల్గొన్న గ్రామస్తులు

ఉపాధి హామీ ద్వారా కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు చేపడతామని సర్పంచ్ సురేష్ గ్రామసభలో తెలిపారు. మంగళవారం మ ద్నూర్ గ్రామ పంచాయతీ అవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామ సభను సర్పంచ్ సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామస్తులు గ్రామ శివారు పంట చేనులకు వెళ్లడానికి రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూలీలకు పనులు కల్పించాలని కోరారు. సభలో ఉప సర్పంచ్ విట్టల్, గ్రామ కార్యదర్శి సందీప్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీపీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెళ్లి పాఠశాలకు హజరువుతున్న విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠశాల సమయ పాలన పాటిస్తున్నారా? సక్రమంగా పాఠాలు బోధిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావ్ పటేల్, ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

ఉమ్మడి మండలంలో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను సీసీడీ వర్నిలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కొల్లూరు కిషోర్ బాబు, ఏజాస్‌ఖాన్, ప్రతి లక్ష్మణ్, కోఆప్షన్, జెడ్పీటీసీ సిరాజుద్దీన్, అనిల్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.35 లక్షలు నిధులతో కోటగిరి మొదటి వార్డులో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శంకర్ పటేల్, వైస్ ఎంపీపీ బాల్ రాజ్, ఏఎంసీ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ అమీద్, మండల అధికారి కొల్లూరు కిషోర్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ కోఆప్షన్ సిరాజుద్దీన్, విండో చైర్మన్ కూచి సిద్దు, నాయకులు సలీం తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ అంబేద్కర్ పార్క్‌లో చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డి జె దయానంద్ పాల్గొని మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా వీరు చేస్తున్న సేవ కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు జంగం నట్కరి రాజశేఖర్, బహుజన సమాజ్ పార్టీ కతర్ అధ్యక్షులు పెంద్యాల గోపి, తలారి రాజేందర్, మోహన్, ప్రతాప్ ,పూల రంగన్న తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి నాయిబ్రాహ్మణ జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కామారెడ్డి పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో కామారెడ్డి జిల్లా నాయిబ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నూతన జిల్లా నాయి బ్రాహ్మణ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు జనపాల ఎల్లయ్య నాయి (భవానిపేట్), అధ్యక్షులు నారాయణపురం మహేందర్ (వడ్లూర్), ప్రధాన కార్యదర్శిగా కాదునూరి రవీందర్ (రామారెడ్డి), ఉపాధ్యక్షులు బాలకిషన్ నాయి (లింగంపేట్), రెండవ ఉపాధ్యక్షులు పి.నాందేవ్ (కామారెడ్డి), జాయింట్ సెక్రెటరీలుగా రాజు, (తాడ్వాయి)భాస్కర్, (దోమకొండ), కోశాధికారి (జాన్కంపల్లి బాబు)ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బోధన్ వాసికి మాతృభాష సాహిత్య సేవా శిరోమణి అవార్డు

నవతెలంగాణ-బోధన్


అవార్డు అందుకుంటున్న రజాక్

బోధన్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు ఎం.ఏ రజాక్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాతృభాష సాహిత్య సేవా శిరస్సు అవార్డు ప్రదానోత్సవాన్ని మంగళవారం చేపట్టారు. ఆయన ఉర్దూ, తెలుగు భాషలో సరళంగా మాట్లాడడంలో ప్రతిభ కలిగిన ఉండడమే కాకుండా ఉర్దూ, తెలుగు భాషల అభివృద్ధికి కృషిచేస్తున్న సందర్భంగా ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రకటించాయి. ఈ అవార్డును మంగళవారం మాతృ భాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ గవర్నర్‌పేటలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రజాక్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ విజయబాబు ఉన్నారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ ప్రముఖులు రజాక్‌కు అభినందనలు తెలిపారు.

దేగల వైష్ణవికి సాహిత్య పురస్కారం


విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల బృందం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ జిల్లా ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న దేగల వైష్ణవికి తెలుగు కూటమి సాహిత్య సంస్థ విజయవాడవారి "తెలుగు తేజం" పురస్కారం లభించింది. వైష్ణవి చిన్నతనంలోనే సాహిత్య పరంగా ఎంతో విశేషమైన కృషి చేస్తున్నందుకు, కవిత్వ, కథ, సరళ, వచన, శతక ప్రక్రియలలో అద్భుతంగా రాణిస్తున్నందుకు ఈ పురస్కారాన్ని తెలుగు కూటమి సాహిత్య సంస్థ వారు అందజేస్తున్నారని పాఠశాల తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. ఇప్పటికే సరళ వచన శతకంలో రెండు పుస్తకాలు ఆవిష్కరించిన వైష్ణవి త్వరలో "చిన్నారి కథలు" అనే సంకలనంతో ముందుకు రాబోతుందని ప్రవీణ్ శర్మ తెలిపారు. తెలుగు తేజం పురస్కారాన్ని అందుకున్న వైష్ణవికి అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా తడపాకల్ పాఠశాల బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు నాగప్ప,గంగాధర్, కృష్ణప్రసాద్, రవీందర్, విజయ్, నరేందర్, స్వప్న, విజయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

దివ్యాంగులకు సబ్సిడి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని దివ్యాంగులకు సబ్సిడి రుణాలకోసం దరఖాస్తులు కోరుతున్నట్లు యంపిడివో రాజేశ్వర్ మంగళవారం తెలిపారు. స్వయం ఉపాధి నిమిత్తం 1 యూనిట్‌కు 50 వేల రూపాలయను 100 శాతం సబ్సిడిచే అందజేయబతుందని పేర్కొన్నారు. ఇందుకు 21 సంవత్సరాలు నిండి 55 సంవత్సరాలలోపు దివ్యాంగులు ఈనెల 28 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోండి

- డీఎంఅండ్‌హెచ్‌వో సుదర్శనం
- అంబేద్కర్‌నగర్‌లో కంటివెలుగు సందర్శన
- పలు మండలాల్లోనూ కొనసాగుతున్న కంటివెలుగు

నవతెలంగాణ-రెంజల్


కంటివెలుగును పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో సుదర్శనం అన్నారు. మంగళవారం మండలంలోని అంబేద్కర్‌నగర్‌లో కంటి వెలుగు ప్రారంభించిన అనంతరం కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, ఆరోగ్య సూపర్‌వైజర్ మాలంబి, ఏఎన్‌ఎంలు శాంతకుమారి, సరస్వతి, కంటి పరీక్ష నిపుణులు ప్రవీణ్, ఇర్ఫాన్, సర్పంచ్ మధురవాయి, ఉప సర్పంచ్ మూసా, వసంత్ కాంబ్లే, తదితరులున్నారు.

కండ్లను కాపాడుకోండి : వైద్యులు బసవరాజ్

మద్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు ద్వారా ప్రజలు కండ్లను కాపాడుకోవాలని వైద్యులు బసవరాజ్ సూచించారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ ఆలయంలో కంటి వెలుగు క్యాంపును నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చిన వారికి వైద్య సిబ్బంది కంటి పరీక్షలను నిర్వహించారు. లక్ష్మీనారాయణ ఆలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ బసవరాజ్, వైద్యులు శ్రీకాంత్, సూపర్‌వైజర్ లక్ష్మి, డీఈఓ ఎండి ముసిఖాన్, ఏఎన్ఎం స్వప్న, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలోని శివ్వాపూర్ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ ధన్నారం లలిత భూమయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరంలో గ్రామస్తులు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంభం సాయవ్వ, వార్డు సభ్యులు, వైద్యులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్త, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-నవీపేట్

మండలకేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన ముత్యాల మహేందర్ (28) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాల మహేందర్ మూడు సంవత్సరాలుగా హైదరాబాదులో ఆటో నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే క్రమంలో ఇంటికి వచ్చి తిరిగి స్కూటీపై వెళ్తుండగా రామాయంపేట వద్ద ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొనగా తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు 108 లో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహానికి గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మహేందర్ మృతి చెందడంతో దర్యాపూరులో విషాదఛాయలు నెలకొన్నాయి.

రీసెర్చ్ మెథడాలజీపై వర్క్ షాప్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్‌లో కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో రీసెర్చ్ మెథడాలజీ పై ఒక రోజు వర్క్ షాప్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులకు పలు సూచనలు తెలియజేశారు. కొత్త విధానాలను ఉపయోగించుకోవడంపై నూతన ఉపకరణాలను వాడుకొని సత్ఫలితాలను పొందేలా వారికి ప్రోత్సాహాన్ని అందించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ

నవతెలంగాణ-భీంగల్

పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నేటి నుండి గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయనున్నట్లు పశువైద్యాధికారి కృష్ణ మంగళవారం తెలిపారు. 22న బెజ్జోర, కుప్కల్, 23న జాగిర్యాల్, భీంగల్, 24 న పురాణిపేట్, మెండోరా, 25 న దేవన్‌పల్లి, ముచ్కూర్, 26 న బడా భీంగల్, చేంగల్, 27 న గోన్‌గొప్పుల, దేవక్కపేట్, 28 న పల్లికొండ, కారేపల్లి, యంజీ తాండ, రూప్లాతాండ లో అందించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటా

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్/తాడ్వాయి

ప్రమాదవశాత్తు తలకు తీవ్ర గాయాలైన బాధితురాలిని ఆదుకుంటానని ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్ హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని పోల్కంపేట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తలారి బొందయ్య కోడలు తలారి హరిత ప్రమాదవశాత్తు తలకి తీవ్ర గాయాలై హైదరాబాద్‌లోని రష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గ్రామస్తులు సమాచారం అందించిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి పేషంట్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అక్కడి డాక్టర్లతో మాట్లాడి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పేషంట్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అండగా తానున్నాని ధైర్యం చెప్పారు. అన్ని విధాలా ఆదుకుంటానని కుటుంబానికి భరోసానిచ్చారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే..

తాడ్వాయి : మండలంలోని కన్కల్ గ్రామంలో కొన్ని రోజుల క్రితం వివిధ కారణాలతో మరణించిన వారి బాధిత కుటుంబ సభ్యులను ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ కలిసి మంగళవారం పరామర్శించారు. అలాగే పలువురికి ఆర్థికసాయం సైతం అందజేశారు. కార్యక్రమంలో సదాశివనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్గం సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ రవీందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, పుల్గం రవీందర్‌రెడ్డి, రాంచందర్‌రావు, మైలారం రవీందర్‌రెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


లింగంపేట్ : వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాలుగు గ్రామాలకు కలిపి సహకార సొసైటీ ఏర్పాటు చేయాలి

ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఇందల్ వాయి మండలంలోని అన్సన్ పల్లి, ఎల్లారెడ్డి పల్లి, వెంగల్ పాడ్, లోలం గ్రామాలను కలిపి నూతనంగా ప్రాథమిక సహకార సొసైటీని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కు ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నాలుగు గ్రామాలకు ఇతర మండలం పరిధిలో ఉండటంతో రైతులకు ఎరువులు, వరి ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బందులు పడుతున్నారని తాటిపాముల శ్రీనివాస్ గుప్తా, గడ్కోల్ శ్రీనివాస్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తెచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సానుకూలంగా స్పందించి వేంటనే వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి ఏర్పాటు కు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాటిపాముల శ్రీనివాస్ గుప్తా, గడ్కోల్ శ్రీనివాస్ తదితరులున్నారు.

నవతెలంగాణ

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

• పాఠశాలను తనిఖీ చేసిన రాష్ట్ర ప్రత్యేక బృందం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పదవ తరగతిలో అత్యున్నత ఫలితాలు సాధించడానికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రస్థాయి ప్రత్యేక బృందం సభ్యులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర మానిటరింగ్ అధికారి శ్రీనాథ్ నేతృత్వంలో విషయ నిపుణులు సంజీవ్, రామకృష్ణ, ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర అధికారి కిషన్ తనిఖీ చేశారు. పదవ తరగతి గదిని సందర్శించిన బృందం సభ్యులు పదవ తరగతిలో అత్యున్నత ఫలితాలు సాధించడానికి ఉత్తమ విద్య బోధన విధానాలను అవలంభించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మండలంలోని హాస కొత్తూరు ఉన్నత పాఠశాలను బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు అందజేస్తున్న బోధన విధానాలను, సౌకర్యాలను, మారిన ప్రశ్నాపత్రం తీరు తెన్నులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా.. పిల్లలందరికీ స్నాక్స్ ఇస్తున్నారా.. విద్యార్థులకు ఉదయం వేకప్ కాల్ చేస్తున్నారా.. తదితర అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షలు ఏ విధంగా రాస్తే మంచి మార్కులు సంపాదించవచ్చనే విషయంలో నిపుణులు విద్యార్థులకు తరగతి గదిలోకి వెళ్లి అవగాహన కల్పించారు. మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. పదోతరగతికి సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్ అన్ని విషయాలను బృందం సభ్యులకు వివరించారు.

మతిస్థిమితం లేని యువతిని ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



కొన్ని రోజుల నుండి పాత కలెక్టర్ గ్రౌండ్, రైల్వేస్టేషన్ ప్రదేశాల్లో తిరుగుతున్న కోటగిరి స్వాతి అనే 21 సంవత్సరాల మతిస్థిమితంలేని యువతిని ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కి సమాచారం తెలుపగా వెంటనే వారు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వారికి తెలిపారు. ఒకటో ఠాణా పోలిస్ సిబ్బంది, సఖి కేంద్ర వారు కలిసి 16వ తేదీ రాత్రి 11గంటలకు కోటగిరి స్వాతిని సదరమ్ హోమ్ లో ఉంచారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునిత ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రి పంపించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ పద్మావతి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, సఖి కేంద్ర భానుప్రియ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, కాసుల సాయి తేజ, రామేశ్వర్ రెడ్డి, సదరమ్ హోమ్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయండి

• ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-సిరికొండ

ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయాలని బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్ టీయూ జిల్లా నాయకులు బలయ్య,యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి వీ పద్మ మాట్లాడుతూ.. ఈనెల 22న ధర్పల్లి మండల కేంద్రంలో జరిగే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలో జిల్లాలో గల బీడీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు. 1972లో ఏర్పడిన బీడీ వర్కర్స్ యూనియన్ 50 సంవత్సరాల నుండి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుందన్నారు. బోనస్, గ్రాట్యుటీ చట్టం, కరువు భత్యం,పీఎఫ్, ఈఎస్ఐ పోరాడి సాధించుకుందన్నారు. సమావేశంలో ఏఐకెపిఎస్ నాయకులు మార్క్స్, సాయన్న,గులాబ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ పోలీసులకు అప్పగింత

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ పోలీస్టేషన్ పరిధిలోని పెద్దవాల్గొట్ చౌరస్తా వద్ద తలకుంట్ల సాయిరెడ్డి అనే రైతుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని తన పొలం వద్ద నిలిపి పొలం పనులు చేస్తుండగా గణేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని దొంగిలిస్తుండగా గ్రామస్థులు పట్టుకుని సిరికొండ పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

నర్సాపూర్‌లో పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



పశువులకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారి

మండలంలోని నర్సాపూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ పెండే ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ శిబిరంలో పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, గర్భ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలకు పరీక్షలు చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్న గొర్రెలు, మేకలకు చికిత్సలు అందించారు. కార్యక్రమంలో 27 ఆవులు, 48 బర్రెలు, 150 గొర్రెలు, 79 మేకలు, ఎనిమిది కుక్కలకు చికిత్సలు చేసినట్లు మండల పశు వైద్యాధికా డాక్టర్ రాజశేఖర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పశువుల యజమానులకు, రైతులకు పశువుల్లో గర్భకోశ వ్యాధుల గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. పశువులలో ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వేల్పూర్ మండల పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ రెడ్డి, మోర్తాడ్ మండల అధికారి డాక్టర్ గౌతమ్ రాజ్ , ఎంపీటీసీ సభ్యురాలు బుస్సాపురం సుప్రియ నవీన్ యాదవ్, పశువైద్య సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ ప్రవీణ్ రెడ్డి, ఓఎస్ జమీల్, హెచ్ ఏ స్వప్న, గోపాలమిత్ర స్వరన్, పశుమిత్ర లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ రోడ్డు వెడల్పుచేసి ట్రాఫిక్ సమస్య తీర్చాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ మంగళవారం బొబ్బిలి వీధిలో పర్యటించారు. వీర్ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. బొబ్బిలి వీధి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బొబ్బిలి వీధిలో రోడ్డు, డ్రైనేజి వ్యవస్థను మెరుగు పరిచామని, ప్రతి వీధిలో సీసీ రోడ్లు, బిటీ రోడ్లు వేశామని, మార్కెట్‌కు వచ్చే ప్రతి రోడ్డు వెడల్పు చేసి ట్రాఫిక్ సమస్యని తీర్చామని తెలిపారు. బొబ్బిలివీధి అభివృద్ధి కమిటి సభ్యులు కొన్ని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. సాధ్యమైనంత త్వరలో పరిష్కారిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బదురి మృదుల అరుణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దండు శేఖర్, బైఖాన్ మధు, బొబ్బిలివీధి అభివృద్ధి కమిటీ సభ్యులు బొబ్బిలి నర్సయ్య, ఆకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుని అకాలమరణం బాధాకరం

• మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మండల నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ గ్రామా శాఖా అధ్యక్షుడు తోట లింబాద్రి అకాల మరణం తీరని లోటని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్ అన్నారు. మంగళవారం రాత్రి వ్యవసాయ బోరు వద్ద విద్యుత్ ఘాతానికి బలి అయ్యారన్నారు. ఈసందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి పార్టీ పరంగా ఆదుకునేందుకు కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ మల్లికార్జున్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రాజ్పాల్ రెడ్డి,కిషోర్ రెడ్డి,హెచ్ వెంకన్న,తదితర బారస నాయకులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రభాత్ పేరి

• భక్తులకు అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో మంగళవారం నిజామాబాద్ జిల్లా ఇస్కాన్ ఆధ్వర్యంలో ఉదయం ప్రభాత్ పేరి, శ్రీకృష్ణుని పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగ కొనసాగింది. ఈ సందర్భంగా రామనంద ప్రభు మాట్లాడుతూ.. అన్ని శాస్త్రాల సార గ్రంథం భగవద్గీత అన్నారు. అనంతరం యాభై ఆరు రకాలతో నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమానికి హాజరైన భక్తుల కోసం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో మధు సుధాన్ , వల్లభప్రియ దేవి, నరేశ్వర ప్రభుజి , గ్రామ సర్పంచ్ సక్కారం అశోక్ , ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, ఎంపీటీసీ సభ్యురాలు తోట జ్యోతి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బైకాన్ ముఖేష్, సభ్యులు , ఇస్కాన్ బషీరాబాద్ ఇంచార్జి నరేందర్, అంజన్న , తుక్కారం, శంకర్, రాములు, బక్కన్న , అరవింద్, దేవేందర్, సంజీవ్ గౌడ్ , భాజన్న , నారాయణ, సామెర సుమన్, వివిధ గ్రామల నుండి వచ్చిన భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

24న యల్ల రాములు విగ్రహ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ,పేదల పెన్నిధి ప్రజా నాయకుడు మాజీ ఎంపీపీ యల్ల రాములు విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈనెల 24 న ఉంటుందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు యల్లా నరేందర్, తార లు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి విచ్చేస్తున్నారని, ఆలూరు బైపాస్ రోడ్డులో జరిగే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నారని ఏడవ వార్డు బి ఆర్ఎస్ విశాఖ కాలనీ అధ్యక్షులు కుంట సత్యం రెడ్డి తదితరులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండలం గడ్కోల్ గ్రామానికి చెందిన నాయకపు గంగాధర్ అనే యువకుడు మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయలై పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గ్రామస్థులు అందించిన వివరాల ప్రకారం. సిరికొండ మండలం కొండాపూర్ నుంచి గడ్కోల్ వస్తుండగా ద్విచక్ర వాహనం పై వస్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలపాలైనట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం సిరికొండ పిహెచ్సికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నిజామాబాదులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-రామారెడ్డి

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బిట్ల రవి సోమవారం రాత్రి మద్యం సేవించి పోలీస్ స్టేషన్‌కు వచ్చి, డ్యూటీలో ఉన్న పోలీసులను బూతు మాటలు తిడుతూ, కుర్చీలను కిందపడేసి, డ్యూటీలో ఉన్న వారి చొక్కా పట్టుకొని గుంజటంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.